గ్రోయిన్లకు మోక్షమెప్పుడో ?

- ఏటా రైతులకు తప్పని సాగునీటి ఇబ్బందులు
- 12 వేల ఎకరాల్లో వరిసాగు ప్రశ్నార్థకం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



గత ఏడాది సొంత నిధులతో దిగువాయి గ్రోయిన్‌ను పూడ్చుకుంటున్న రైతులు



తాండవ నదిపై శిథిలావస్థలో ఉన్న కామినీడువారి గ్రోయిన్

కోటనందూరు: పాలకుల అలసత్వం, అధికారుల ఉదాశీనత వెరసి తాండవ గ్రోయిన్ల కింద ఆయకట్టు రైతుల పాలిట శాపంగా మారింది. మెట్ట ప్రాంతమైన కోటనందూరు, తుని మండలాల్లోని రైతులకు తాండవ నదిలో వృథాగా పోతున్న నీటిని మళ్లించి సాగునీరుగా అందించేందుకు బ్రిటిష్ కాలంలో తాండవ నదిలో గోయిన్లు నిర్మించారు. కాల క్రమంలో రెండు దశాబ్దాల క్రితం నాటికే ఈ గ్రోయిన్లు శిథిలావస్థకు చేరాయి. ఈ గ్రోయిన్ల కింద వేల ఎకరాల ఆయకట్టు ఉంది. గ్రోయిన్లు శిథిలావస్థకు చేరడంతో గత పదేళ్లుగా గ్రోయిన్ల కింద ఆయకట్టు రైతులు సాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే రైతులు శ్రమదానంతో గ్రోయిన్ల దగ్గర ఇసుక బస్తాలు వేసుకొని పంటను ఒడ్డుకు చేర్చుకుంటున్నారు. ఈ ఇబ్బందిని రైతులు ఏటా ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో గ్రోయిన్ల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని రైతులు భావించినా ఇప్పటి వరకూ ఆ దిశగా అడుగులు పడలేదు. ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్న వేళ పాలకులు, అధికారులు గ్రోయిన్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నియోజకవర్గంలో 30 వేల ఎకరాల ఆయకట్టు

తాండవ జలాశయం పరిధిలో తుని నియోజకవర్గంలో 30 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో 18 వేల ఎకరాల ఆయకట్టుకు తాండవ జలాశయం నుంచి కోటనందూరు, భీమవరపుకోట, ఇందుగపల్లి మేజర్ కాలువల ద్వారా సాగునీరు అందిస్తున్నారు. మిగిలిన 12 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు ఆరు దశాబ్దాల క్రితం తాండవ నదిపై అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలో నిమ్మకట్టుతో పాటు మండలంలో అల్లిపూడి, కొట్టాం, కోటనందూరు, కామినీడు, దిగువాయి గ్రోయిన్లు నిర్మించారు. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ గ్రోయిన్ల పరిసర ప్రాంతంలో విచ్చల విడిగా ఇసుక తవ్వకాలు జరుగుతుండడంతో గోయిన్లు శిథిలమైపోయాయి. గత 20 ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతూ వస్తోంది. ఈ దుస్థితితో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా రైతులు సాగునీటి కోసం అష్టకష్టాలు పడక తప్పడం లేదు. నదిలో నీటిని గ్రోయిన్ల ద్వారా పొలాలకు మళ్లించకపోతే పంటలు ఎండిపోతాయి.

అధికార పార్టీ నేతలే కాంట్రాక్టర్లు

గత చరిత్ర గమనిస్తే శిథిలమైపోతున్న గ్రోయిన్లను నిర్మించేందుకు అధికార పార్టీ నేతలే కాంట్రాక్టర్లుగా వ్యవహరించారు. కంటి తుడుపు చర్యగా నాసిరకం మెటీరియల్‌తో లోపభూయిష్టంగా చేసిన పనులు ఏడాది లోపే ఏటిలో కొట్టుకుపోయేవి. మళ్లీ ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతులు గోల చేయడం, అధికారులు ప్రణాళికలు తయారు చేయడం, ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పరిపాటిగా మారింది. ఇలా ప్రతి ఏడాది గ్రోయిన్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం, సాగునీటి కోసం రైతులు ఇబ్బంది పడడం రివాజుగా మారింది. ఇప్పటికీ ఏటా ఖరీఫ్‌కు ముందు అన్నదాతలు గ్రోయిన్ల దగ్గర ఇసుక బస్తాలు వేసుకొని సాగునీటిని మళ్లించుకునే దయనీయ పరిస్థితులు కొనసాగుతున్నాయి.

గ్రోయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి



తాండవ నదిలో అడ్డగోలుగా జరుపుతున్న ఇసుక తవ్వకాల కారణంగా రూ.కోట్లతో నిర్మించిన గ్రోయిన్లు శిథిలమయ్యాయి. గ్రోయిన్లు సక్రమంగా లేక ఏటా సాగునీటి కోసం ఇబ్బంది పడాల్సిన దుస్థితి. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరిపంట నీరందక ఎండిపోయే పరిస్థితులు ఏటా ఎదురవుతున్నాయి. పట్టించుకోవాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. గ్రోయిన్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

– రామసూరిసత్యనారాయణ, రైతు, బొద్దవరం

క్లుప్తంగా

యువజన విభాగం అధ్యక్షుడిగా బ్రహ్మనాయుడు



తుని: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోటనందూరు మండలం వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా బంగారు బ్రహ్మనాయుడును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని అప్పలరాజుపేటకు చెందిన బ్రహ్మనాయుడుకు పదవి దక్కడంతో ఎంపీపీ లగుడు శ్రీనివాస్, బీసీ నేత గొర్లి రామచంద్రరావు, చింతకాయ చినబాబు, ఎన్.గోవింద్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ



గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు మామిడి రాము విద్యార్థులకు కథలు చదువుట, రాయుట, పద్యాలు చదివి భావాలు చెప్పుట, చిత్రలేఖనం, నృత్యం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు విధిగా విజ్ఞాన శిబిరాలకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రచారానికే పరిమితమైన చలివేంద్రాలు



కోటనందూరులో సంపద కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం ఇలా..

కోటనందూరు: ప్రస్తుత వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఉన్నతాధికారులకు ఫొటోలు చేరిన తరువాత అవి అలంకార ప్రాయంగా మారాయి. కేవలం చలివేంద్రం అనే ఫ్లెక్సీబోర్డులు తప్ప ఎక్కడా మంచినీరు అందుబాటులో ఉంచడం లేదు. ఈ దుస్థితిపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ



ఏలేశ్వరంలో అవగాహన ర్యాలీ చేస్తున్న నారాయణస్వామి, రైతులు

ఏలేశ్వరం: పట్టణంలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణస్వామి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం లేకుండా ఆరోగ్యకరమైన దిగుబడులు పొందవచ్చన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ వేదిక ప్రారంభం



పాండురంగ కల్యాణ వేదికలో పూజలు చేస్తున్న దాతలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పాండురంగ కల్యాణ వేదికను శనివారం దాతలు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఏడు కుటుంబాలకు చెందిన దాతల విరాళాలతో పాండురంగ కల్యాణ వేదిక నిర్మించారు. ఈ వేదికలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు, వార్షిక, మాస కల్యాణాలు, గోదారంగనాథుల కల్యాణ మహోత్సవాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా అర్చకులు శాంతి హోమం నిర్వహించారు. ధర్మకర్తలు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

విజ్ఞానంతో భవితకు బాటలు వేసుకోవాలి



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో విద్యార్థినికి పట్టా అందజేస్తున్న అతిథులు, అధ్యాపకులు

గండేపల్లి: విద్యార్థులు తాము నేర్చుకున్న విజ్ఞానంతో బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని నేపాల్‌లోని ఖాట్మాండ్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ యు.ప్రసాద్, జింబాబ్వే ఎంబసీ భారతదేశ ప్రతినిధి ఫినియాస్ మాన్యాంగ్ సూచించారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన ఇంటర్‌నేషనల్ స్టూడెంట్స్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదుకున్న రోజులు, స్నేహితులు, ఉపాధ్యాయులతో నడుచుకున్న విధానం జీవితంలో మధురానుభవంగా మిగిలిపోతాయన్నారు. 2024–25 విద్యాసంవత్సరంలో బీటెక్, ఎంటెక్, బీఫార్మసీ, ఎంఫార్మసీ, బీఎస్సీ ఫోరెన్సిక్, బీబీఏ, ఎంబీఏ విభాగాల్లో విద్య పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం. శ్రీనివాసరెడ్డి, ప్రొఫెసర్ ఎంబీ శ్రీనివాస్, డీన్ పరంజిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ
- గ్రామాల్లో కిశోరి వికాస శిబిరాలు



గండేపల్లిలో కిశోరి వికాసం శిబిరానికి హాజరైన వివిధ శాఖల సిబ్బంది



కిర్లంపూడిలో కిశోరి వికాసం వేసవి శిబిరాన్ని ప్రారంభించిన అధికారులు

కిర్లంపూడి: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ పేర్కొన్నారు. స్థానిక సత్యదేవ కల్యాణ మండపంలో కిశోరి వికాసం వేసవి శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఎస్సై జి.సతీష్, ఎంఈఓ టి.జోసెఫ్, ఏపీఎం ఎస్. వేదకుమారి, ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, వైద్యులు హేమాంజలి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమాజానికి ఆడపిల్లల ఆవశ్యకత, ఆరోగ్య సమస్యల నివారణ, లింగసమానత్వం, బాల్యవివాహాల నివారణ వంటి అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పూర్ణిమ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎవరైనా చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితుల రీత్య, వేర్వేరు కారణాలతో బాల్య వివాహాలు చేస్తే బాలికలు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. చట్టపరమైన వయస్సు వచ్చేంత వరకు పిల్లలకు వివాహం చేయవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. సూపర్‌వైజర్లు సునీత, బూసమ్మ, కరిమున్నిషా, మహిళా పోలీసులు, ఎఎన్ఎంలు, ఆశ, అంగన్వాడీ టీచర్లు, వీఓఏలు ఉన్నారు.

గండేపల్లి: ఆపదలో ఉన్న వారు టోల్ ఫ్రీ నంబర్ 100కు కాల్ చేసి రక్షణ పొందాలని జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ అధ్యక్షతన నిర్వహించిన కిశోర వికాసం వేసవి శిబిరాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆపద ఎదురైనప్పుడు ఆత్మ రక్షణ కోసం పోలీస్ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు రోజులో కొంత సమయాన్ని తమ పిల్లలతో గడపాలన్నారు. సీడీపీఓ పూర్ణిమ మాట్లాడుతు బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, కిశోర్ బాలికల సమస్యలు, పిల్లల సంరక్షణ, పోలీస్ సేవలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపార్వతి, సీనియర్ అసిస్టెంట్ లలిత, కిశోర బాలికల సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల సంక్షేమానికి పెద్దపీట

తుని: బాలికల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువనసుందరి అన్నారు. స్థానిక 17వ వార్డు బాడవతోట మున్సిపల్ స్కూల్లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌమార బాలికల సాధికారిత కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు సమతుల్య ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అన్ని రంగాల్లో దూసుకుపోయేలా ప్రణాళికలు వేసుకుని ఆ దిశగా అడుగులేయాలని సూచించారు. కార్యక్రమంలో నార్ల రత్నాజీ, గెడ్డమూరి శివ, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై చర్చించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి

ఏలేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ (జేఎస్‌సీ) సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై చర్చించాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్‌పీ శాస్త్రి కోరారు. పట్టణంలో శనివారం రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఏలేశ్వరం యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచినా ఇప్పటివరకు జేఎస్‌సీ సమావేశం ఏర్పాటు చేయలేదన్నారు. ఇహెచ్‌ఎస్ కార్డు ద్వారా పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుకు ఇన్సూరెన్సు కంపెనీలతో చర్చలు జరిపి నగదు రహిత వైద్యం అందించాలన్నారు. పీఆర్‌సీ, ఐఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 8వ పీఆర్సీ ద్వారా పెన్షనర్లను విభజించే ప్రయత్నం చేస్తోందన్నారు. దీని ద్వారా ఓపీఎస్ పెన్షనర్లకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉండడంతో గత 15 రోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఏలేశ్వరం యూనిట్ ద్వారా పెన్షనర్లకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు కె.పద్మనాభం, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ భువన సుందరి, కమిషనర్ వెంకట్రావు

తుని: మున్సిపల్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి అన్నారు. బ్యాంకుకాలనీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు బోడపాటి రోహిత్ (554), కర్రి సాయి(515), బోడ్డు విజయ్(505) మార్కులు సాధించడంతో శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ భువన సుందరి సత్కరించారు. పట్టణ పరిధిలోని మున్సిపల్ పాఠశాలల్లో 83.3 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయురాలు కె.హేమలత తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, నాయకులు నార్ల రత్నాజీ, బోడపాటి అప్పారావు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు తోట పరామర్శ



గోకవరంలో పార్టీ నాయకులను పరామర్శిస్తున్న తోట నరసింహం

గోకవరం: మండలంలోని పలు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం శనివారం పరామర్శించారు. తిరుమలాయపాలెం ఉప సర్పంచ్ దాకారపు దుర్గా ప్రసాద్ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఆయన్ను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అదే గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు షేక్ హుస్సేన్ బైపాస్ హార్ట్ సర్జరీ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన్ను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇటీవల పాము కాటుకు గురై గోకవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ బూలా అబ్బులు, కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న మండల ఎస్సీసెల్ కన్వీనర్ బిజ్జి రాజును పరామర్శించారు. అలాగే పితృవియోగంతో బాధపడుతున్న నియోజకవర్గ మైనార్టీ సెల్ కన్వీనర్ ఎస్ఎస్ అలీషాను పరామర్శించారు. ఆయన వెంట దాసరి చినబాబు, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, సుంకర వీరబాబు, సుంకర వెంకటరమణ, సమ్మెటి నాని, టౌన్ కన్వీనర్ బాదితబోయిన చిన్నా, నరాలశెట్టి నర్సయ్య, ఇజ్జిన కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు తోట పరామర్శ

కిర్లంపూడి: మండలంలోని పలు కుటుంబాలను శనివారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం పరామర్శించారు. తామరాడ గ్రామ సర్పంచ్ తోట అయ్యన్న తల్లి తోట కృష్ణవేణి, పాలెం గ్రామానికి చెందిన అడారి వీరబాబు తాత అడారి సన్యాసిరావు ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను తోట నరసింహం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తోట బాబ్జీ, తోట బాబు, గణేషుల లచ్చబాబు, అడబాల సుబ్బారాయుడు, పెద్దిరెడ్డి లక్ష్మణరావు, రామకుర్తి రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సత్తెన్న కల్యాణోత్సవాలకు ఆహ్వానం



జగపతినగరంలో భక్తులకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కృష్ణబాబు

కిర్లంపూడి: అన్నవరం వీరవేంకటసత్యనారాయణ స్వామి వారి దివ్యకల్యాణ మహోత్సవాలకు రావాలని భక్తులను సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు కోరారు. ఈ మేరకు శనివారం మండలంలో భక్తులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నవరం దైవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 13 వరకూ అన్నవరంలో వీరవెంకట సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కల్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో భకులు తరలిరావాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీ మండల సారథులకు అభినందనలు


రౌతులపూడి: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సూచనల మేరకు పార్టీ అధిష్టానం నియమించిన మండల సారథులకు మాజీ ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు అంగూరి లక్ష్మీశివకుమారి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని గ్రామాలు, అన్నివర్గాలకు సమ ప్రాధాన్యం కల్పించి సమతూకంతో సంస్థాగత నియామకాలు చేసిన పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ గిరిబాబుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల కమిటీలతో పాటు అనుబంధ కమిటీలకు ఎంపికైన ప్రతిఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తేవాలన్నారు.

రాష్ట్ర అనుబంధ విభాగాలకు అధ్యక్షులు నియామకం

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన ముగ్గురికి పదవులు దక్కాయి. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరిగాయి. రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధిగా గొల్లు వెంకటరమణ, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శిగా అడపా సోమేష్, రాష్ట్ర ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం సహాయ కార్యదర్శిగా చిలకమర్తి వీఎస్ సాయిప్రసాద్‌లను నియమించారు.

ప్రత్తిపాడులో వర్షం

ప్రత్తిపాడు: గ్రామంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒంటికు ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చల్లని గాలులతో కూడిన వర్షం పడింది. ప్రజలు వర్షానికి కాస్త ఉపశమనం పొందారు.



ప్రత్తిపాడులో కురుస్తున్న వర్షం


మృతుల కుటుంబాలకు చేయూత



ప్రత్తిపాడులో మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న రమణ తదితరులు

ప్రత్తిపాడు: ఇటీవల యర్రవరం ఏలేరు కాలువలో పడి మృతి చెందిన వారి కుటుంబాలకు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రూ.25 వేల ఆర్థిక సహాయం అందించారు. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన అరట్లకట్ల సత్యవతి, గోర్స వీర మనోజ్ ఏలేరు కాలువలో స్నానానికి దిగి మృతి చెందిన సంఘటన తెలిసిందే. వాకర్స్, ఫొటోగ్రాఫర్స్, ల్యాబ్ టెక్నీషియన్లు, వైద్యులు, ఉపాధ్యాయులు ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో వైద్యులు ఏవీ రమణ, ఆర్ఆర్ పవన్‌కుమార్, అందే చిట్టికొండ, రావూరి తాతాజీ, చిట్రా అప్పారావు, పుప్పాల బుచ్చిబాబు, రాపర్తి రామలింగేశ్వరరావు, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ క్రమ శిక్షణ కమిటీ వైస్ చైర్మన్ ధరణాలకోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ




తునిలో ఆర్టీసీ సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డిపో మేనేజర్ కిరణ్‌కుమార్

తుని: వడగాలుల పట్ల ఆర్టీసీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సరఫరా చేసిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ముగిసే వరకూ వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ఏలేశ్వరం: వేసవి ఎండలను తట్టుకొనేందుకు ఆర్టీసీ సిబ్బందికి శనివారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్ జీవీవీ సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌చార్జి ఏవీఎస్ నారాయణ ఆధ్వర్యంలో ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. వేసవి ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఫైర్ ఆఫీసర్‌గా ఆలీబేగ్



ప్రత్తిపాడు: స్థానిక అగ్ని మాపకకేంద్రం ఫైర్ ఆఫీసర్‌గా ఎండీ ఆలీబేగ్ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కొవ్వూరు అగ్ని మాపక కేంద్రంలో లీడింగ్ ఫైర్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆలీబేగ్ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. మూడేళ్ల క్రితం అప్పటి ప్రత్తిపాడు ఫైర్ ఆఫీసర్ మణిరత్న వరుణ్‌కు వేరే శాఖలో కొలువు రావడంతో వెళ్లిపోయారు. అప్పటి నుంచి పిఠాపురం అగ్నిమాపక అధికారి ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. నూతన ఫైర్ ఆఫీసర్ ఆలీబేగ్‌కు ఫైర్‌మెన్లు కేఎస్ఎన్ మూర్తి, పి.సూర్యనారాయణ, టి.దుర్గాప్రసాద్, కె.వేణు, రాఘవులు స్వాగతం పలికారు.